# ఇది తప్పు కాదు కదూ!!

ఇది తప్పుకాదు కదూ?? ఇది తప్పా? తప్పేమో?? కాదు! కాదు!

నారాయణరావు పొద్దున్నుంచి ఇరవై ముప్పైసార్లు ఇలా డోలాయమానంగా ఆలోచనలో ఉన్నాడు. భార్య సుమతి ఏడుస్తుంటే ఓదారుస్తున్నాడు- కాఫీ ఇస్తున్నాడు. కాస్సేపయ్యాక తిక్కగా కసురుకుంటున్నాడు. మళ్లీ జాలేసి ఓదారుస్తున్నాడు.

అసలు తప్పంతా సుమతిదే!

తనకి పిల్లలు లేరనీ, కాపురానికొచ్చినప్పట్నుంచీ బెంగే ఆవిడకి. పదిహేనేళ్లుగా చేయని నోములు లేవు. మొక్కని దేవుళ్లు లేరు. పోన్లే పూజలూ వ్రతాలూ అంటూ బిజీగా ఉందిలే కాస్త బెంగ తగ్గుతుందనుకున్నాడు నారాయణరావు.

తన ఇంటికేదో వాస్తు దోషం ఉంది. అందుకనే పిల్లలు కలుగలేదని ఎల్లమ్మో పుల్లమ్మో చెప్పిందట ఓసారి. ఇంక సతాయించటం మొదలెట్టింది భర్తని సుమతి. భార్య కోసం ఆ ముచ్చటా తీర్చాలనుకుని వాస్తు శాస్త్రజ్ఞుణ్ని పిలిచాడు. ఆయన చెప్పినట్లు గోడల్ని ముక్కముక్కలు చేసి గుమ్మాల సంఖ్య పెంచి గదుల సంఖ్యని పెంచి ఏంటేంటో చేశాడు.

దానివల్ల ఆమె కోరిక తీర్లేదుగానీ ఇంటి నిండా ఖాళీ గదులు తయారయ్యాయి.

"ఏవండీ... లింగూ లిటుకూమంటూ ఇద్దరం. ఇన్ని గదుల్లో మీరెక్కడున్నారో వెతకటంతో అలిసిపోతున్నానూ... పోనీ దక్షిణం వాటా ఎవరికైనా అద్దెకిద్దాం" అందో రోజు సుమతి.

'అమ్మయ్య' అనుకున్నాడు నారాయణరావు. వాస్తు మహానుభావుడి ధర్మమా అని కొంత అప్పు చేయాల్సొచ్చింది. కొంతలో కొంత ఊరట లభిస్తుందనుకున్నాడు.

మహేశ్... పంచాయతీ గుమస్తాగా కొత్తగా ట్రాన్స్‌ఫరై వచ్చాడు. 'అద్దెకివ్వబడును' అన్న బోర్డు చూసి లోపలికొచ్చాడు.

'మంచివాడిలాగే ఉన్నాడు' అనుకున్నారు ఓనర్లు.

మహేశ్‌కి వీళ్ల ఇల్లు కూడ బాగానే నచ్చింది. ముఖ్యంగా 'ఓనర్లు కమర్షియల్‌గా కాకుండా ఆప్యాయంగా మాట్లాడారు' అనుకున్నాడు మహేశ్.

మరుసటి వారం... మహేశం కుటుంబాన్ని తీసుకొచ్చాడు. మహేశానికి ఇద్దరు పిల్లలు. నాలుగు ఏళ్ళు పెద్దమ్మాయికి, రెండు ఏళ్లు చిన్నమ్మాయికీ ఉంటాయి. దాన్లో వచ్చీరాని మాటల చిన్నపిల్ల

కల్యాణి వచ్చిన రెన్నాళ్లలోనే సుమతికి చేరికైపోయింది. వాళ్లమ్మ రాణికి కూడా సగం పని తగ్గింది. కల్యాణికి స్నానం చేయించి పంపాక ఇంక మిగిలిన సంరక్షణంతా సుమతే చేస్తుంది.

"మా ఇంట్లో పప్పులో కారం ఎక్కువ పడిపోయింది. కల్యాణికి నీ పప్పే పెట్టాలివ్వాళ" అని రాణి సుమతి దగ్గరికి అన్నం కంచం తీసుకెళ్లి తినిపిస్తుంది.

మధ్యాహ్నం పూట సుమతితో ఆడి ఆడి కల్యాణి నిద్రపోతుంది. తన మంచం మీద తన పక్కన సొంత కూతుర్లా పడుకున్న కల్యాణిని చూసి తన్మయంగా మురిసిపోతుంటుంది. తనకి కునుకు పట్టే వరకు పాపనే చూస్తుంటుంది. కలలో కూడా పాపనే చూస్తుంటుంది.

సుమతి భర్త ఇంటికి రాగానే కల్యాణి లీలలు కథలు కథలుగా చెప్పేస్తుంటుంది.

మొదట్లో.... భార్య ఆనందాన్ని చూసి ముచ్చట పడేవాడు నారాయణరావు. రాన్రానూ... పరాయి బిడ్డ మీద అంతలా ప్రేమ పెంచేసుకుని తనేం ఇబ్బంది పడుతుందో అని భయపడేవాడు.

నిజంగా... తను భయపడ్డంతా అయింది.

ఓరోజు అర్ధరాత్రి భర్తని లేపి "కల్యాణిని మనం దత్తత చేసుకుందామండీ" అంది సుమతి.

"అదేంటి... వాళ్ల పిల్లని మనకెందుకు ఇస్తారు?"

"మనకిస్తే నష్టం ఏంటి? చక్కగా చూసుకుంటాం. మంచిగా చదివిస్తాం. వైభవంగా పెళ్లి చేస్తాం. మనిల్లు, ఆస్తి... అన్నీ తనకే ఇచ్చి

వాళ్లింట్లోనే ఉంటూ మనవల్తో కాలక్షేపం చేద్దాం''

సుమతి ఆశలూ అయిడియాలూ విని నారాయణరావుకి వణుకు పుట్టింది. అప్పటికప్పుడే వ్యతిరేకిస్తే కథ ఎటు తిరుగుతుందో అని "సర్లే... ఆలోచిద్దాం'' అని పక్కకి తిరిగి పడుకున్నాడు.

"ఆలోచించడమేంటి... వెంటనే అడిగేయడమే'' సుమతి ఆర్డరేసింది. నారాయణరావుకి ఇంక నిద్ర పట్టలేదు. నిద్ర నటిస్తూ ఆలోచిస్తున్నాడు.

కల్యాణికి సుమతి అంటే చాలా ఇష్టం. తల్లిలా కోప్పడకుండా గారం చేసి చాక్లెట్లూ, బిస్కట్లూ పెడతారని సాధారణంగా పిల్లలందరూ పక్కింటివాళ్లతోనో ఎదురింటి వాళ్లతోనో కలిసిపోతారు. పిల్లలంటే అందరికీ ముద్దే గనుక ఎలాగైనా వాళ్లని మాలిమి చేసుకుని ఎత్తుకుని తీసుకెళ్లడానికి బొమ్మలూ చాక్లెట్లూ లంచం పెడతారు.

కల్యాణి కథ అలాగే నారాయణరావింట్లో మొదలైంది. కానీ సుమతి వ్యధే ముదిరి పోతోంది. ఏం చేయాలో పాలుపోట్లేదు అతనికి.

'వాళ్లని ఇల్లు ఖాళీ చేసి పొమ్మనాలి... లేదా మీ పిల్లని మేం దత్తత చేసుకుంటాం ఇవ్వమని అడగాలి. అవును... అడిగితే తప్పేం ఉంది? పాపం సుమతి అంత ఆశ పెట్టుకుంది కదా... ఓ సారి ప్రయత్నిద్దాం. వాళ్లు నో అంటే... సుమతి తల్లడిల్లిపోదూ?' ఇలా పరిపరివిధాలా ఆలోచిస్తున్నాడు.

ప్రశ్నలు పెరుగుతున్నాయి. సమాధానాలు దొరకట్లేదు.

తప్పంతా మహేశం దంపతులదే అని కన్‌క్లూజన్‌కొచ్చాడు. వాళ్లే కల్యాణిని తన ఇంటి మీదికి తోలేసి ఇంత ప్రోబ్లెం క్రియేట్ చేశారని

అనుకున్నాడు. నిజమే... డెసిషన్‌కొచ్చాడు.

మర్నాడు పొద్దున్నే... కాఫీ ఇస్తూ, టిఫిన్ పెడుతూ భర్తకి రెండు మూడు సార్లు జ్ఞాపకం చేసింది. "మీరు అడుగుతారా నేను అడగనా?"

"ఎవరూ వద్దు. ఇవి మూఢం రోజులు. ఇలాటి రోజుల్లో ఏ ప్రయత్నం మంచిది కాదు. అసలు ఆ ఆలోచనలే ఇప్పుడు చెయ్యకు" భార్య నోటికి తాళం... ఆశకి బ్రేకూ పడ్డాయి. నారాయణరావు అయిడియా బాగానే పని చేసింది.

✦ ✦ ✦

ఓ రోజు మహేశాన్ని రోడ్ మీద కలిసి, పార్కువైపు తీసుకెళ్లాడు నారాయణరావు.

పరిస్థితి అంతా వివరించాడు. మహేశం పిల్లని దత్తత ఇవ్వడానికి సుముఖంగా లేనట్లు స్పష్టంగా అర్థమైంది.

"అందుకే నేనూ అడగొద్దనే అనుకున్నాను. అడిగి లేదనిపించు కోవటం కన్నా అడక్కపోతేనే మంచిదని" ఫెయిర్‌గా అన్నాడు నారాయణ రావు.

"మరి నన్నెందుకు ఇక్కడికి..." వెటకారంగా అనబోయి ఆగి పోయాడు మహేశం.

తనమీద తనే జాలి పడ్డాడు. నవ్వు నటిస్తూ "అదే విషయం చెబ్దామని పిలిచాను. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే మా సుమతి తరవాత్తరవాత చాలా డిసప్పాయింట్ అవుతుంది. అంచేత మీరు ఇక్కణ్నుంచి ట్రాన్స్‌ఫర్ చేయించుకోవాలి. మీకే ఊరు వెళ్లాలన్నా

చెప్పండి.  మన ఎమ్మెల్యే గారితో చెప్పి పంపిస్తా''

మహేశం అర్థం చేసుకున్నాడు.  తనూ సొంత ఊరుకే ట్రాన్స్‌ఫర్ కోసం ట్రై చేశాడు గానీ పనవ్వలేదు.

ఇదీ మంచి అవకాశమే.

అయితే సుమతికీ సంగతి తెలియనివ్వద్దని ఇద్దరూ అనుకున్నారు.

వారం తిరక్కుండా మహేశానికి ట్రాన్స్‌ఫర్ అయిపోయింది. సుమతి విలవిలలాడింది. “నేను దురదృష్టవంతురాల్ని.  మనస్సులో దత్తత విషయం అనుకున్నాను. దేవుడు శాపం పెట్టేసి వాళ్లని ట్రాన్స్‌ఫర్ చేసేశాడు.  ఆ ఆలోచనే రాకపోతే ఇంకొన్నాళ్లయినా పాపతో ఆడుకునేదాన్నేమో.... అని ఏడ్చింది.

సుమతిని ఓదార్చటం నారాయణరావుకి అంత సులువు కాదు. ఆమె కోలుకునేదాక  తనకీ బాధ  తప్పదు.

తనే ప్లాన్ వేసి, వాళ్లని పంపేశానే అని ఫీలవుతూ ఉండేవాడు కానీ తప్పదు.

ఇది తప్పుకాదు కదూ...

తప్పేమో...

కాదు...

కాదు కదూ...

ఇలా తర్జనభర్జనలో ఉన్న నారాయణరావు మరో బుజ్జి కల్యాణి కోసం అనాధాశ్రమానికి బయల్దేరాడు.

